# కలిసిన హృదయాలలోన...

"**నా**కీ పెళ్ళి వద్దు".

నెమ్మదిగానే అయినా స్థిరంగా చెప్పిన మనస్విని మాటలకు అక్కడున్న నలుగురూ ఆశ్చర్యంగా, అపనమ్మకంగా చూశారు.

"నిన్నెవరూ బలవంతపెట్టి ఒప్పించలేదుగా, వద్దనటానికి? నీ అంతట నువ్వే స్వతంత్రంగా నిర్ణయించుకున్నదేగా!" 'స్వతంత్రంగా' అనే మాటను ఒత్తి పలుకుతూ తమ్ముడు హరి అన్న మాటలకు మనస్విని సమాధానం చెప్పలేదు. సుమతి ఏదో అనబోతోంటే అడ్డుపడింది. "ప్లీజ్ అమ్మా... ఏం చెప్పొద్దు! ఈ విషయం మీద డిస్కషన్ వద్దు. పెళ్ళి కాన్సిల్ అని రాజేష్‌కి ఫోన్ చేసి చెప్పేశాను"

తండ్రి దగ్గరకు వెళ్ళి "పొరపాటుచేశాను. నన్ను క్షమించండి నాన్నా" అని గదిలోకి గబగబా వెళ్ళిపోయింది మనస్విని.

హరి లేచి నిలబడి కూర్చున్న కుర్చీని విసురుగా వెనక్కి తోసి "నేనలా బయటకు వెళ్లొస్తాను" అన్నాడు.

"కామేశ్వరావుని కలుస్తానని చెప్పాను. నన్ను వాళ్ళింటి దగ్గర డ్రాప్ చేయి" అంటూ రఘుపతిగారు లేచారు. వాళ్ళిద్దరూ వెళ్ళిన కాస్సేపటి వరకూ సుమతి, సునంద చిత్తరువుల్లా కూర్చున్నారు. చెల్లెలు పెళ్ళికి ముహూర్తాలు పెట్టుకుంటున్నారని సునంద ఊరి నుంచి వచ్చి అరగంటయింది. మనస్విని ప్రేమించిన అబ్బాయి రాజేష్‌తోనే పెళ్ళి నిశ్చయమైందని సునందకి తెలుసు.

"మనూ అలా అందంటే ఏమై వుంటుందీ?" సునంద తల్లిని అడిగింది. సుమతి నిట్టూర్చింది.

"నాకు మాత్రం ఏం తెలుసు ఎక్కడికో వెళ్ళొస్తానని అరగంట క్రితం బయటకు వెళ్ళింది. ఇదిగో ఇప్పుడు వచ్చీ రావటంతోనే ఈ మాట చెప్పింది మతిపోయేటట్లుగా. అసలు ఎన్ని మంచి

సంబంధాలు వచ్చాయనీ! అప్పుడేమో అందరికీ యింకా చదువుతానంటోందీ, అప్పుడే పెళ్ళి వద్దంటోందీ అని చెప్పాం. ఆరు నెలల క్రితం నాన్నగారి ఫ్రెండు కంట్రాక్టరు బలరాం లేదూ ఆయన తన కొడుక్కి మనూని అడిగాడు కట్నంగా ఏం ఇవ్వక్కర్లేదని కూడా అన్నారట. ఆ రోజు నాన్న చాలా ఆనందంగా ఈ విషయం చెప్పేసరికి, మనూ అంతకు నాలుగు రోజుల క్రితమే ఈ అబ్బాయి రాజేష్ అడిగితే ఇష్టమేనని చెప్పానని చెప్పింది. మేమూ ఇక తన ఇష్టానికి సరే అన్నాం. ఇద్దరూ ఏవో ఎగ్జామ్స్‌కి ప్రిపేరవుతున్నారుగా ఆరు నెలల తర్వాతే పెళ్ళి అనుకున్నారు. నిన్ననే అబ్బాయి తల్లి రుక్మిణిగారు, మావయ్య వచ్చి అన్నీ మాట్లాడుకుని వెళ్ళారు. రేపు ముహూర్తాలు పెట్టుకుందామని అనుకుంటుంటే, ఇప్పుడు ఇలా అంటోంది ఏమైందో అడుగుతా" అంటూ సుమతి లేచింది.

"మనూ ఏమిటో చాల అప్‌సెట్ అయినట్లుగా ఉంది. కొంచెం స్థిమితపడనీ, నేను అడుగుతాలే. ముందు వంటపని చూద్దాం" అంది సునంద.

మంచం మీద పడుకుని కిటికీలోంచి బయటకు చూస్తున్న మనస్వినిని అనునయిస్తున్నట్లుగా చల్లగాలి అల వచ్చి మెల్లగా తాకింది. సన్నగా చినుకులు పడటం కూడా ప్రారంభమైంది.

సరిగ్గా ఇలాంటి వాతావరణంలోనే కదూ రాజేష్ తనని అడిగిందీ! ఆ రోజు... అమ్మా, నాన్న బంధువులింటికి వెళ్ళారు. వరండా గదిలోని టేబుల్ ముందు కూర్చుని లైబ్రేరీ నుండి తెచ్చిన బుక్స్ నుంచి నోట్సు రాస్తోంది. అప్పుడు రాజేష్ వచ్చాడు. ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుని కొంచెం సేపు ఏవో మాట్లాడాడు.

ఆ ఊళ్ళోనే వున్న మెయిన్ బ్రాంచిలో జాబ్ చేస్తున్న రాజేష్ తమ బ్రాంచికి ఆఫీసు పనిమీద తరచూ వస్తూండటంతో పరిచయం కలిగింది. కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కి తనతోపాటూ ప్రిపేరవమని సలహా ఇచ్చి ప్రోత్సహించాడు. లైబ్రేరీ నుండి బుక్స్ తెచ్చిస్తూ తరచూ ఇంటికి వస్తూండటంతో చనువూ, స్నేహం పెరిగాయ్! మాటల మధ్యలో తన అందం గురించీ, తెలివి తేటల గురించీ అప్పుడప్పుడూ సరదాగా కామెంట్ చేస్తుంటాడు.

ఆ రోజు వాతావరణం ఇలాగే ఉంది.

బయటకు చూస్తూ రాజేష్ అన్నాడు "చల్ల చల్లని గాలులూ, చిటపట చినుకులూ.. ఇంత ఆహ్లాదంగా ఉన్న సమయంలో నా అదృష్టాన్ని పరీక్షించుకోవాలనిపిస్తోంది!"

"అదేమిటి?" అంది తను అర్థంకాక.

"అదే నా మనసులోని మాట గురించి, పెళ్ళి... మీ ఉద్దేశం..." తడబడుతూ ఆగిపోయాడు. ఒక్క క్షణం తన గుండె వేగంగా కొట్టుకుంది. రెండు నిముషాలు మౌనంగా ఉండిపోయింది. ఆ తర్వాత చెప్పింది.

"అక్కడున్న అద్దాల బీరువాలోని బుక్స్, కప్పులూ నాకు హైస్కూలులో, కాలేజీలో డిబేట్, ఎస్సే రైటింగులలో వచ్చిన ప్రైజులని చెప్పా కదూ, ఆ పెద్ద కప్పు నాకు టెన్తుక్లాసులో వరకట్నం గురించి మాట్లాడినప్పుడు వచ్చిన ఫస్టుప్రైజు. జడ్జీగా వున్న ఒక టీచరు ఆ రోజు నాతో 'అందరూ చెప్పిన పాయింట్సే నువ్వూ చెప్పావు గానీ ముగింపుగా చెప్పిన వాక్యానికే ఎక్కువ మార్కులు పడి నీకు ప్రైజు వచ్చింది' అని చెప్పారు. ఆ వాక్యం ఏమిటో తెలుసా? పెళ్ళంటే... కాకూడదు పెద్దల మధ్య ఇచ్చి పుచ్చుకునే విషయంలో కుదిరే ఒడంబడిక! అది రెండు జీవితాలు ఒక్కటయ్యే అపురూపమైన వేడుక!"

రాజేష్ చిన్నగా నవ్వాడు.

"మీ ఉద్దేశం నాకర్థమయింది. నా విషయంలోనూ అది ఒడంబడిక కాబోదు! మరి ఆ అపురూపమైన వేడుకలో మీ ప్రక్కన కూర్చునే అదృష్టం నాకు లభిస్తుందా?"

ఒక క్షణం ఏం చెప్పాలో తెలియని స్థితిలో ఉండిపోయింది. ఎలాగో మెల్లగా చెప్పింది. "ఇలాంటి సందర్భాల్లో చాలా కథల్లో 'అదృష్టం మీది కాదు నాది' అనే డైలాగు ఉంటుంది. అది చాలా రొటీన్ డైలాగే అయినా ఇప్పుడు నాకు ఆ మాటనే మనస్ఫూర్తిగా చెప్పాలని అనిపిస్తోంది!"

"నిజంగా?!" అంటూ చటుక్కున లేచి నిలబడ్డాడు. ఆ క్షణం అందమైన అతని మొహంలో మెరిసిన మెరుపును చూశాక మనసులో మళ్ళీ అనుకుంది "ఇంతగా ప్రేమించే వ్యక్తితో జీవితాన్ని పంచుకోగలగటం నిజంగా అదృష్టమే" అని.

అతను వెళ్తోంటే ఆ రోజు గేటు వరకూ వెళ్ళింది. స్కూటరు స్టార్టుచేసి వెళ్లబోతూ ఆగి అన్నాడు. "మీ ఇంటికి వచ్చేటప్పుడు నేను నేను ఒక సామాన్య వ్యక్తిని మాత్రమే కానీ ఇప్పుడు ఒక మధుర సామ్రాజ్యానికి చక్రవర్తిననే ఫీలింగుతో వెళ్తున్నాను!"

అమ్మకి ఈ విషయం ఎలా చెప్పాలా అనే సందిగ్ధంలో ఉండగానే నాలుగు రోజులు గడిచే సరికి చెప్పాల్సిన అవసరం రానే వచ్చింది. నాన్న బలరాం అంకుల్ వాళ్ళ అబ్బాయి గురించి చెప్పినప్పుడు రాజేష్ గురించి అమ్మకి చెప్పింది. అమ్మ అతని జీతం, ఆస్తిపాస్తులు వివరాలూ అడిగింది. అప్పటికి తనకివేమీ తెలియవు. అదే అంటే ఆశ్చర్యంగా చూసింది.

తనకి నవ్వొచ్చింది. అతనితో పరిచయం పెరిగి, అతనంటే ఏమిటో తెలిసేకొద్దీ ఇష్టం కలిగి, అతను తన ప్రేమను వ్యక్తం చేయగానే తనూ ఇష్టంగా అంగీకరించింది అంతే కాని ఆస్తిపాస్తుల వివరాలన్నీ తెలుసుకుని అంగీకారం తెలుపుతారా ఎవరైనా! అప్పుడది ప్రేమ ఎలా అవుతుందీ?!

తన మాటలను బుగ్గన వేసుకుని ఆశ్చర్యంగా విన్న అమ్మ ఆఖరున పకపక నవ్వింది. ఆ నవ్వుకి అర్థం అప్పుడు తనకు తెలియలేదు 'పెద్ద ఆరిందలా, అనుభవజ్ఞురాలిలా మాట్లాడేస్తున్నావే ఏమీ తెలియక పోయినా పిచ్చిమొహమా!' అని ఆ నవ్వుకి అర్థం అయి వుంటుందని ఇప్పుడు తెలుస్తోంది!

చెక్కిళ్ళమీదుగా జారిన కన్నీళ్ళను తుడుచుకుంది.

సునంద వచ్చి మనస్విని పక్కన కూర్చుని అనునయంగా అడిగింది.

"అతనికి పెళ్ళి కాన్సిల్ అని చెప్పేశానంటున్నావ్, కారణం ఏం చెప్పావు?"

"ఉన్నదే చెప్పాను. మీ సంబంధం కావాలని వచ్చిన వాళ్ళను ఇంత కట్నం కావాలని అడగటం కొంత సమంజసంగా ఉంటుందేమో కానీ మా అబ్బాయి మీ అమ్మాయిని ప్రేమించాడు. ఇంత కట్నం ఇవ్వండి అని మీరు అడగడం ఎంత సిల్లీగా ఉంటుందో మీ ఆలోచనలకి అందలేదా?" అని అడిగి ఇక మాట్లాడకుండా ఫోన్ పెట్టేశాను. లేకపోతే నిన్నంతా అందరూ కూర్చుని కట్నం లాంఛనాలు అంటూ ఒకటే బేరసారాలు! పైగా వాళ్ళు అన్నింటికీ పట్టుబట్టకుండా కొన్నింటిలో మన మాట కూడా ఒప్పుకున్నారని అమ్మా, నాన్న సంతోషం చేస్తున్నారు. కొంచెం కన్సెషన్ దొరికిందన్న మాట! ఇక ఈ రోజంతా వాళ్ళకివ్వాల్సిన కట్నాలకీ, మన ఖర్చులకీ కావాల్సిన డబ్బు గురించి తర్జన భర్జన. చివరకు ఏం తేల్చారంటే, వచ్చే నెలలో గృహప్రవేశం అనుకుంటున్న కొత్త ఫ్లాటుని అమ్మకం పెట్టాలని!"

"అబ్బ! ఇదా నీ సమస్య? సరేలే, ఇంకేదో గొడవనుకున్నాను! అప్పు తెస్తే వడ్డీలు పెరిగిపోతాయి. తీర్చగలుగుతామో లేదోననే బెంగ పట్టుకుంటుంది. అమ్మేస్తే ఇబ్బంది లేకుండా పెళ్ళి సవ్యంగా

జరిగిపోతుంది. నాన్న రిటైరయినప్పుడు వచ్చే డబ్బులో అప్పుడు అవకాశం వుంటే కొనుక్కుంటారు. నీ పెళ్ళి అయిపోతే నాన్నకిక సమస్య ఏం ఉంటుందీ, హరికి ఉద్యోగం వస్తే అసరాగా కూడా వుంటాడు".

మనస్విని చివాలున లేచి కూర్చుని కోపంగా అంది "హరి కూడా నిన్న సరిగ్గా ఇదే మాట అన్నాడు. నాకు చాలా అవమానంగా అనిపించింది! నాపెళ్ళి మాత్రం సమస్య. హరిది కాదు. మనల్నందరినీ అమ్మా, నాన్న ఒక్కలాగే పెంచారు. ఏం చదువుతామన్నా చదివిస్తామని చెప్పారు. చదివించారు. వాడు అంత శ్రద్ధగా చదివేవాడు కాదు. నేను మాత్రం క్లాసులో ఫస్టున ఉండాలనే పట్టుదలతో చదివేదాన్ని. అమ్మా నాన్న మెచ్చుకుంటే గర్వంగా, ఆనందంగా ఫీలయ్యేదాన్ని. కానీ పెళ్ళి దగ్గరకొచ్చేసరికి నేను సమస్య, భారం అయ్యాను. వాడు మాత్రమే అమ్మా వాళ్లకి ఆసరా కాగలుగుతాడు! అందుకే కాబోలు పేపరులో పొదుపు గురించిన ప్రకటనల్లో పిల్లల చదువులు, పెళ్ళిళ్లకి డబ్బు ఆదా చేసుకోండని చెప్పరు. అమ్మాయి పెళ్ళి, అబ్బాయి చదువు అంటారు. వాళ్ళతో సమానంగా చదివి ఉద్యోగాలు చేస్తున్నా ఈ పరిస్థితులు ఇలా ఉండాల్సిందేనా?! "మనస్విని గొంతు బొంగురుపోయింది.

సునంద చిన్నగా నవ్వింది. "బావుంది నా పెళ్ళి కట్నం ఇచ్చి చేయలేదూ, నీదీ అలాగే చేస్తారు. దానికి నువ్వింత వర్రీ అవటం దేనికే!"

"నీకు సంబంధాలు చూసినప్పుడు నాలుగైదు మనకి అందుబాటులో లేవని మానుకున్నారు. మరి నాలుగు మనకే నచ్చక మానేశారు. చివరకు మనకు నచ్చిందీ. అందుబాటులో ఉన్నదీ అని బావవాళ్ళ సంబంధం నీకు కుదిర్చారు. కానీ ఇప్పుడు అలాగ కాదు. నాన్నకి ఆ ఛాయిస్ లేదు. ప్రేమించానని చెప్పాను, కాబట్టి తప్పకుండా వాళ్ళ కోరికలు తీర్చి చేయాలనుకుంటారు. లవ్ మ్యారేజి అంటూ నేను చేసిన నిర్వాకం ఇది!"

"నువ్వు చెప్పేది నాకేం నచ్చలేదు, ఎవరికైనా కట్నం ఇవ్వక తప్పనప్పుడు నచ్చిన వాడికి ఇచ్చి చేస్తారు. తల్లితండ్రులు అమ్మాయి పెళ్ళి చేయటం భారం అని బాధపడరు. అది వాళ్ళు ఆనందంగా నెరవేర్చే బాధ్యత!"

"నేను మాత్రం ఇలాంటి పెళ్లి చేసుకోను, పెళ్లికాకపోయినా ఫరవాలేదు. పెళ్ళి ఒక్కటే జీవిత పరమార్థం కాదు" ఆవేశంగా అంది మనస్విని.

కాలేజీలోనూ, ఆఫీసులోనూ, తెలిసినవాళ్ళలోనూ చాలామందే తన దగ్గర పెళ్ళి ప్రస్తావన తెచ్చారు. అప్పుడే పెళ్ళి ఉద్ధేశంలేదంటూ సున్నితంగా తిరస్కరించింది. వాళ్ళంతా కూడా ఇంతేనా? అంగీకరించి ఉంటే, అప్పుడు పెద్దవాళ్ళ ద్వారా కట్నం ప్రసక్తి వచ్చేది కాబోలు!

"మనూ, సరిత వచ్చింది" సుమతి కేకేసింది.

మనస్విని, సరిత హైస్కూలు నుంచి యూనివర్శిటీ వరకూ క్లాస్‌మేట్స్. ఆరు నెలల క్రితమే సరితకి పెళ్ళయి అత్తగారి ఊరు వెళ్ళింది. 'ఎప్పుడు వచ్చావ్'? అంటూ మనస్విని స్నేహితురాలికి ఎదురెళ్ళి ఆనందంగా పలుకరించింది.

"చల్లగా ఉంది. బయట కూర్చుందాం" అంటూ రెండు కుర్చీలు పెరట్లోని మందార మొక్క పక్కన వేసింది.

సరిత ఊరి నుండి వచ్చి రెండు రోజులయిందని తెలిసి "ఇప్పుడా రావటం" అంటూ కోపగించుకుంది.

"ఏం చేయమంటావ్ చెప్పు... ఈ రెండు రోజులూ ఒకటే తిరగటం అయింది. మా మేనత్త ఊరి నుండి వచ్చింది. 'ఏ రెండు మూడేళ్ళకోగానీ రాదు. మంచి చీరె పెట్టండి' అని నాయనమ్మ వార్నింగు ఇచ్చేస్తుంది అత్తయ్యరాగానే. ఇక ఆ పనిమీద నిన్న తిరిగాం. అన్నయ్యకి అమ్మాయి పుట్టిందిగా, బాలసారెకి అమ్మ రెండు రోజుల్లో వెళ్ళాలి. అందుకని బట్టలూ బంగారం కొనాలంటుంది అమ్మ. అప్పులెక్కువైపోతున్నాయి, వద్దన్నాడు అన్నయ్య. వట్టి చేతుల్తోవెళ్తే నలుగురిలో అక్కడ చిన్నతనంగా ఉంటుందంటూ అమ్మ తన చేతి గాజులు రెండూ అమ్మేసి చిన్న గొలుసూ, బట్టలూ కొంది. బాగా వున్నవాళ్ళకి ఇలాంటి లాంఛనాలన్నీ ముచ్చట్లు! మనలాంటి వాళ్ళకేమో ఇక్కట్లు!" మనస్విని నవ్వింది. "బాగుందే నువ్వు చెప్పేది! కట్నం గొడవకంటే కూడా ఇవి ఎక్కువా ఏం?"

"ఎందుకాదు? మా సంగతే తీసుకో. నాలుగు నెలలక్రితం పెద్దక్క మావగారు చనిపోయారు. అమ్మా వాళ్ళు ఆక్కా బావలకి బట్టలు పంపించాలి. అక్కావాళ్ళు బిజినెస్‌లో బాగా సంపాదించిన వాళ్ళు. వాళ్ళ తోడికోడలుకి ఖరీదైన బట్టలు తెస్తారు కాబట్టి తనకీ ఖరీదైన గద్వాల్ చీరకొనమని కబురు పెట్టింది అక్క. రెండు నెలల క్రితం చిన్నక్కావాళ్ళు ప్లాటు కొనుక్కుని గృహప్రవేశం చేశారు. వ్రతానికి అమ్మావాళ్ళు బట్టలుపెట్టాలి. 'తక్కువలో కొనకండి. కావాలంటే తక్కువైనది నేనిస్తానని' చిన్నక్క అంటే అమ్మ 'ఆడపిల్ల సొమ్ము తీసుకుంటామా, మేమే ఏదో కిందామీదా పడతాంగానీ' అంటూ అప్పుచేసి ఖరీదైన బట్టలు పంపించింది. ఇక కిందటి నెలలో శ్రావణ మాసం నోముకి మా అత్తగారూ వాళ్ళని పిలిచారు. మరి ఇది మొదటి సంవత్సరంగా! వాళ్ళు తేవాల్సినవన్నీ తేలేదని మావాళ్ళు అనుకున్నారు. అమ్మావాళ్ళు పెట్టిన చీరె రంగు తనకి నప్పదనీ, జరీ మంచిది కాదనీ, ఎవరికైనా పెట్టటానికి పనికి వస్తుందంటూ బీరువాలో పడేసింది మా అత్తగారు!

పెళ్ళిలోనూ అంతే. అటూ ఇటూ పెట్టాల్సినవీ, తేవాల్సినవీ ఏదో చాలా చెబుతారుగా! మా ఇంట్లోనేమో 'మీ అత్తగారూ వాళ్ళు మనం పెట్టాల్సినవన్నీ లిస్టు చెబుతారు. మనకి పెట్టాల్సిన వాటి దగ్గరకొచ్చేసరికి ఆనవాయితీ లేదంటారు' అని అనుకున్నారు. మా అత్తగారేమో 'ఇద్దరి అమ్మాయిల పెళ్ళిళ్ళు చేసి మీ అమ్మావాళ్ళు అలిసిపోయారు కాబోలు, నీ దగ్గర కొచ్చేసరికి ఏ అచ్చటా ముచ్చటాలేదు' అని ఆవిడ అనుకున్నారు! ఎపుడో అప్పటి పరిస్థితులను బట్టి ఎవరో నిర్ణయించిన ఈ ఆచారాలను మారిన రోజులను బట్టి మార్చుకుందాం. వదిలించుకుందామని మాత్రం ఎవ్వరూ అనుకోరు!

నేను ఉపన్యాసంలా ఒకటే వాగుతుంటే, నువ్వేం మాట్లాడటం లేదేమిటీ? నీ పెళ్ళి కబుర్లు చెప్పవేం? ఈ వారంలో ముహూర్తాలు పెట్టుకుంటారని అన్నారుగా?"

"కట్నాల ప్రసక్తి వచ్చేసరికి నేనే పెళ్ళి వద్దన్నాను"

"నిజంగానా?" అంటూ సరిత ఆశ్చర్యంగా చూసింది.

"మా వాళ్ళు సిద్ధపడ్డారు కానీ నాకే ఇష్టంలేదు."

"బాగా ఆలోచించావా"

"ఆఁ... ఇక ఈ విషయం మీద డిస్కషన్ వద్దని కూడా చెప్పేశాను." సునంద తెచ్చిచ్చిన టిఫిన్‌ని కాలేజి కబుర్లు గుర్తువేసుకుంటూ ఇద్దరూ తిన్నారు. మళ్ళీ కలుస్తానంటూ సరిత వెళ్ళిపోయింది.

ఆ రాత్రి ఆలోచనలతో మనస్విని ఆలస్యంగా నిద్రపోవటంతో మర్నాడు ఉదయం ఎనిమిది గంటల వరకూ లేవలేదు. "రుక్మిణిగారు వచ్చారు. నీతో మాట్లాడాలట, లే" అంటూ సునంద హడావుడిగా లేపింది. మనస్విని ఉలిక్కిపడి లేచింది. "అమ్మ కాఫీ ఇచ్చింది. తాగుతున్నారు నువ్వు త్వరగా తయారై, రా!" అంది సునంద.

తనతో ఏం మాట్లాడతారో అనుకుంటూ త్వరత్వరగా తయారై వెళ్ళి ఆవిడ దగ్గర కూర్చుంది. ఆవిడ అప్యాయంగా చిరునవ్వు నవ్వింది. మనస్విని ముభావంగా ఏం మాట్లాడాలో తోచనట్లు కూర్చుండి పోయింది. ఒక క్షణంలో ఆవిడే మొదలు పెట్టింది.

"నిన్న రాజేష్ ఇంటికి వస్తూనే పెళ్ళి కాన్సిలయిందని చెప్పాడు. నాకేం అర్థంకాలేదు. ఎందుకని అడిగితే 'నువ్వు నిర్ణయించిన నారేటు ఆ అమ్మాయికి నచ్చలేదు' అని, 'నాకు చెప్పకుండా ఇలా చేస్తావనుకోలేద'ంటూ గదిలోకి వెళ్ళి తలుపులేసుకుని పడుకున్న వాడు భోజనానికి పిలిచినా రాలేదు. వాడి మనసు చాలా సున్నితం. కట్నం గురించే సమస్య అని అర్థం అయింది. అందుకే నీతో మాట్లాడదామని వచ్చాను.

...మా పెద్దబ్బాయికీ కట్నంగా ఇచ్చిన డబ్బంతా పెళ్ళికే ఖర్చయింది, పట్టుచీరెలూ, నగలకే సగం పైగా ఖర్చయింది. ఆ తర్వాత ప్రయాణం ఖర్చులు, భోజనాలు, బట్టలు మేళాలు అంటూ చాలానే ఉంటాయిగా! మాకూ వెనక ఆస్తులేం లేవు. ఇద్దర్నీ కష్టపడి చదివించాం. ఉద్యోగాలు చేసుకుంటున్నారు. పెళ్ళికి అప్పుచేస్తే తీర్చేభారం వాడి మీదే పడుతుంది. ఆయన రిటైరయ్యారు. పెన్షను వస్తుంది కానీ ఏమూలకి! అందుకే మేమూ పద్ధతి ఉంది కదాని కట్నం అడిగాం".

"మీ లాగే నన్నూ అమ్మా వాళ్ళు చదివించారు. ఉద్యోగం చేసి సంపాదించే స్థితిని కలిగించారు. అయినా కట్నం ఇవ్వాలి. అందుకేగా అందరూ అబ్బాయిలను ప్లస్సులనీ, అమ్మాయిలను మైనస్‌లనీ అవమానకరంగా మాట్లాడటం!" రోషంగా అంది మనస్విని.

మనస్విని చేతిని తన చేతిలోకి తీసుకుని అప్యాయంగా నవ్వింది రుక్మిణి "పద్ధతీ, మా పరిస్థితీ నీకు వివరంగా చెప్పాను. మీరిద్దరూ, ఆలోచించుకుని ఏం చేస్తే బావుంటుందో చెప్పండి. అంతా మీ ఇష్టానికే వదిలేస్తున్నాం. నేను ఇంటికి వెళ్ళి రాజేష్‌ని కృష్ణమందిరం దగ్గరకు పంపుతాను. అరగంటలో నువ్వూ వెళ్ళి మాట్లాడు. ఈ మాత్రం దానికే పెళ్ళి మానుకోవాల్సిన అవసరం లేదని చెప్పటానికే వచ్చాను. మా వాడు అందమైన అమ్మాయినే కాదు, వ్యక్తిత్వం, ఆత్మగౌరవం ఉన్న అమ్మాయిని ప్రేమించినందుకు నాకూ ఆనందంగానే ఉంది!"

మనస్విని ఆశ్చర్యంగా చూస్తూండిపోయింది! కట్నం గురించీ, లాంఛనాల గురించీ నిన్న అంత కచ్చితంగా మాట్లాడిన ఆవిడేనా ఈ రోజు ఇంత సౌమ్యంగా ఆప్యాయంగా మాట్లాడుతున్నారు? బహుశా నిన్న అత్తగారుగా దర్పంగా కోరికలు కోరితే, ఈ రోజు కొడుకు మనసెరిగిన కన్నతల్లిగా ఒక మెట్టుదిగి వచ్చి మాట్లాడారు కాబోలు.

ఆవిడ వెళ్ళగానే మనస్విని కృష్ణమందిరానికి వెళ్ళి రాజేష్‌తో మాట్లాడి అరగంట తర్వాత ఇంటికి వచ్చింది. అప్పుడు అందరికీ తమ నిర్ణయాన్ని చెప్పింది.

"రాజేష్ రిజిస్టర్ మ్యారేజీ సజెష్ట్ చేశాడు. కానీ నాకెందుకో మంత్రాలు, తలంబ్రాలు... మేళాలు, స్నేహితులు... ఆ సందడితో సాంప్రదాయికంగా జరిగే పెళ్ళి వేడుక ఇష్టం. అందుకే పెళ్ళి అలా జరగాలని అనుకున్నాం. ఈ సంవత్సరంగా నా శాలరీని ఏ ఖర్చుకైనా పనికి వస్తుందంటూ ఖర్చు చేయనీకుండా నాన్న బ్యాంకులో వేయించారుగా, ఆ మొత్తమూ రాజేష్‌కి ఆఫీసులో లోను ఇస్తారట అదీ కలిపి పెళ్ళి ఖర్చు పెట్టాలని అనుకున్నాం. ఖరీదైన పట్టుచీరెలూ, నగలూ ఉండవ్! వాళ్ళింట్లో వాళ్ళకి, మనింట్లో వాళ్ళకీ బట్టలు కొంటాం. లాంఛనాలనేవి పెళ్ళిలోనే కాదు అటు తర్వాత కూడా ఏమీ ఉండవ్! ఎప్పుడైనా ఏవైనా ఇష్టం కొద్దీ ఇచ్చుకోవటమే గానీ!"

"పట్టుచీరెలూ, నగలూ లేకుండా పెళ్ళేమిటే బాబూ. అసలు ఈ సమయంలోనేగా ఆడవాళ్ళకి కొంచెం బంగారం, నాలుగు ఖరీదైన చీరెలూ ఏర్పడతాయ్! ఆ తర్వాతయితే మనం మళ్ళీ కొనుక్కోగలమా?"

సునంద మాటలకి మనస్విని చిన్నగా నవ్వింది. వేల ఖరీదుల్లో కొన్న పెళ్ళి పట్టుచీరెలు నువ్వు ఎన్నిసార్లు కట్టావే? సంవత్సరానికి ఏ ఒకసారో, రెండు సార్లో, అంతేగా? అలా బీరువాలో ఉండే వాటి కోసం అప్పు చేసి కొనాలా! మేమిద్దరం ముందు మా ఉద్యోగాల్లో మంచి పొజిషన్‌కి చేరుకోవటానికి శ్రమపడతాం. ఆ తర్వాత అప్పు చేయకుండా పట్టుచీర కొనుక్కోగలిగిన స్థితిలో ఉంటే, అప్పుడైనా అంత ఖరీదైన చీరె కట్టుకోవటం నాకిష్టమనిపిస్తే కొనుక్కుంటాను. నగలైనా అంతే! పెళ్ళి ఆడంబరంగా జరగటం కంటే ఆనందంగా జరగటమే మనలాంటి మధ్య తరగతి వాళ్ళకి కావల్సింది!"

రఘుపతి గారి దగ్గరకు వెళ్ళి మనస్విని అడిగింది "నాన్నా, మీరు ఏం అభ్యంతరం చెప్పకుండా అంగీకరిస్తారుగా?"

కూతురిని దగ్గరకు తీసుకుని వాత్సల్యంగా అన్నారు "అంగీకరించటమే కాదు. ఒక కొత్త సాంప్రదాయానికి శ్రీశీకారం చుడుతున్న మీ జంటని మనస్ఫూర్తిగా అభినందిస్తూ ఆశీర్వదిస్తాను. అలాగే అప్పుచేయకుండా మీ కాపురానికి మేమిచ్చే కానుకల్ని మీరూ తీసుకోవాలి. నాకున్న ఫ్లాటులోనే కాదు. మరే ఆస్తివున్నా, ఆ తృణం పణంలో హరితో పాటూ నీకు సమాన వాటా ఉంటుంది!"

"అంతే కాదు నాన్నా, బాధ్యతల్లోనూ నాకు వాటా కావాలి! కొడుకు దగ్గరకెళ్ళి ఎంత స్వతంత్రంగా ఉంటారో, అలాగే మా దగ్గరకూ వచ్చి వుండాలి. మీకేమైనా చేయాల్సి వచ్చినప్పుడు కోడలు బాధ్యత కొద్దీ చేస్తుంది, కూతురయితే అభిమానంతో చేస్తుందని గుర్తుంచుకోండి!"

హరి లేచి నిలబడి నవ్వుతూ అన్నాడు. "నేనలా బయటకు వెళ్ళొస్తానమ్మా! మొన్న పునర్జన్మల గురించి డిస్కషన్ వస్తే. మా ఫ్రెండ్స్‌తో నాకు నమ్మకం లేదని వాదించాను. కానీ ఇప్పుడు నమ్మకం ఏర్పడింది. కందుకూరి వీరేశలింగంగారు మా అక్కగా జన్మించారని ఈ రోజు తెలిసిందని మా ఫ్రెండ్స్‌కి ఈ న్యూస్ చెప్పి రావాలి!"

అంతా నవ్వారు.

మౌనంగా లోపలకు వెళ్ళిపోతున్న తల్లిని చూస్తే మనస్వినికి కోపం వచ్చిందేమోనని అనుమానం కలిగింది. వెనకే వెళ్ళి భుజాలు పట్టుకుని అడిగింది. "ఏంటమ్మా నువ్వేం మాట్లాడలేదూ, కోపం వచ్చిందా ఇలా చేశానని?"

"కోపం ఎందుకు మనూ! నీ ఆత్మ విశ్వాసం, ధైర్యం చూస్తుంటే తల్లిగా గర్వంగా ఉంది! నువ్వు మాట్లాడుతోంటే, నా మనసులోని మాటలే వినిపిస్తున్నట్లుగా ఆశ్చర్యంగా అనిపించింది! పాతికేళ్ళ క్రితం నాటి నా ఆలోచనలనే నువ్వు ఆచరణలో పెట్టి చూపిస్తుంటే... ఆనందంగా ఉంది!"

"నిజంగానా అమ్మా" అంటూ మనస్విని సంబరంగా తల్లిని చుట్టేసింది. మనస్విని చెంపలను నిమురుతూ అనురాగం తొణికిసలాడే గొంతుతో సుమతి చెప్పింది "అవును మనూ! పిల్లలను ప్రేమించే తల్లిదండ్రులు అందరికీ ఉంటారు. కానీ అంతే ప్రేమగా, బాధ్యతగా స్పందించే పిల్లలు కొంతమంది అదృష్టవంతులైన తల్లిదండ్రులకే ఉంటారు. మేమూ అలాంటి అదృష్టవంతులమైనందుకు చాలా చాలా ఆనందంగా ఉంది!"

ఈనాడు ఆదివారం. 19, అక్టోబరు, 1997